సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 7 । మే । 2023



జూన్ 15 నాటికి సిద్ధం

ఉద్దానం ప్రాజెక్టు జూన్ 15 నాటికి సిద్ధం కానుంది. ఆ మేరకు మంత్రి సీదిరి ప్రకటించారు.

- 8లో



వైశాఖ ప్రత్యేక మార్గాలు

వైశాఖ మాసంలో ఆదిత్యుని దర్శనానికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	36°	26°
ఇచ్ఛాపురం	35°	26°
పాతపట్నం	35°	25°
శ్రీకాకుళం	35°	26°

న్యూస్‌రీల్

'మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలి'



మొక్కజొన్న పంట కొనుగోళ్లను పరిశీలిస్తున్న సిద్ధార్థ జైన్

లావేరు: మొక్కజొన్న పంట కొనుగోలును వేగవంతం చేయాలని సర్వేఅండ్ రికార్డ్స్ రాష్ట్ర కమిషనర్ సిద్ధార్థ జైన్ అన్నారు. ఆయన మండలంలోని గురుగుబిల్లి గ్రామానికి శనివారం వచ్చారు. గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి మొక్కజొన్న పంట కొనుగోళ్లను పరిశీలించారు. సచివాలయాన్ని సందర్శించి అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వ్యాపారులు సిండికేటై మొక్కజొన్న ధర తగ్గించేశారని గ్రామస్తులు చెప్పగా.. పంట కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసిన రైతులకు గోనె సంచులు ఇచ్చి వెంటనే పంటను కొనుగోలు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు వ్యవసాయశాఖ జేడీ కె.శ్రీధర్, జిల్లా ఉద్యానవనశాఖ ఆర్‌వీవీ ప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ ఆర్.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, వ్యవసాయశాఖ ఏడీఏ వి.శ్రీనివాసరావు, లావేరు తహసీల్దార్ ఎస్.దిలీప్ చక్రవర్తి, లావేరు ఏఓ డి.మహేష్‌నాయుడు, వీఏఏ టి.లక్ష్మణ, వైఎస్సార్ సీపీ నాయకులు బాడిత రాంబాబు, బాడిత దొరబాబు తదితరులు ఉన్నారు.

సత్వర న్యాయమే లక్ష్యం: కలెక్టర్



ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తోందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారంపై జిల్లా యంత్రాంగం, పోలీసు, తదితర శాఖలు ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై తక్షణం స్పందించడం వల్ల 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు 33 లక్షల 75వేల రూపాయలు, గత రెండేళ్లలో రూ.2.50 కోట్ల పరిహారాన్ని బాధితులకు అందించినట్లు తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, అట్రాసిటీ కేసులపై విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాల మ్యాపింగ్ కారణంగా అట్రాసిటీ కేసు ల పరిహారం చెల్లింపుల్లో కాస్త జాప్యం జరుగుతోందని, ఈ విషయాన్ని బాధితులకు వివరించాలని సభ్యులను కోరారు. శ్రీకాకుళం హౌ సింగ్ బోర్డు కాలనీలో గల అంబేడ్కర్ ఆడిటోరియంలో స్టడీ సర్కిల్ విషయమై సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులను ఆదేశించారు. గార మండలం చింతవలస గ్రామంలోని శ్మశానానికి రహదారి విషయమై పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్‌కు సూచించారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

కాశీబుగ్గ: మూత్ర విసర్జన కోసం వెళ్లిన ఓ వృద్ధురాలు రైలు ఢీకొని చనిపోయిన ఘటన పలాస రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల మేరకు.. 70 ఏళ్ల వయసు గల మహిళ శనివారం వేకువజామున పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టి చనిపోయిందని తెలిపారు. ఎరుపు పువ్వుల చీర, ఎరుపు జాకెట్ వేసుకుని ఉందని, వృద్ధురాలిని గుర్తు పట్టిన వారు తమకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు.

టెన్త్ ఫలితాల్లో సిక్కోలు ప్రతిభ

అద్వితీయం

- రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన జిల్లా
- గత ఏడాదితో పోల్చితే పెరిగిన ఉత్తీర్ణత
- ఈ ఏడాది కూడా బాలికలదే పైచేయి
- పాసైన వారిలో 80 శాతం మందికి ఫస్ట్‌క్లాస్



శ్రీకాకుళం న్యూకాలనీ:

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అ'ద్వితీయ' ప్రతిభ కనబరిచారు. శనివారం వెలువడిన ఫలితాల్లో జిల్లా విద్యార్థులు హవా కనబరిచి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు, యంత్రాంగానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా నుంచి పదో తరగతి పరీక్షలకు మొత్తం 28,724 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకాగా 84.53 శాతం ఉత్తీర్ణతతో 24,279 మంది పాసయ్యారు. ఇందులో 14,701 మంది బాలురు పరీక్షలు రాయగా 82.66 శాతం ఉత్తీర్ణతతో 11,507 మంది పాసయ్యారు. అలాగే 14,023 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 86.48 శాతంతో 12,127 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే 3.82 శాతం మెరుగ్గా ఉత్తీర్ణత పొందారు.

ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతలో సిక్కోలే టాప్..

పది ఫలితాల్లో ఉత్తీర్ణతలో రెండోస్థానంలో నిలిచిన సిక్కోలు విద్యార్థులు.. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల జాబితాలో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. జిల్లా నుంచి 24,279 మంది ఉత్తీర్ణులుకాగా.. ఇందులో 19,364 మంది ప్రథమ శ్రేణి(ఫస్ట్‌క్లాస్)లో పాసవడం గమనార్హం. ఈ లెక్కన టెన్త్ పాసైన విద్యార్థుల్లో 80 శాతం మంది ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణులయ్యారు. ఇక ద్వితీయ శ్రేణిలో 3,177 మంది, తృతీయ శ్రేణిలో 1,254 మంది పాసయ్యారు. ఫెయిలైన వారికి ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తారు.

గత పదేళ్లగా జిల్లా టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఇలా..

విద్యాసంవత్సరం	ఉత్తీర్ణత శాతం	ఏపీలో సిక్కోలు స్థానం
2013-14	87.12	09
2014-15	91.68	07
2015-16	92.79	04
2016-17	96.10	02
2017-18	96.58	04
2018-19	95.58	06
2019-20	100	-
2020-21	100	-
2021-22	78.22	02
2022-23	84.53 (ప్రస్తుతం)	02

హాస్టల్ విద్యార్థులు భేష్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు టెన్త్‌లో చక్కటి ఉత్తీర్ణత సాధించారు. బీసీ సంక్షేమ పరిధిలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను 63 వసతి గృహాల నుంచి విద్యార్థులు రాశారు. వీటిలో 12 వసతి గృహాల్లో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. యాభై శాతానికి పైగా మూడు వసతి గృహాల్లో పాసయ్యారు. మొత్తం 895 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వీరిలో 720 మంది పాసై 80.45 ఉత్తీర్ణత శాతం సాధించారు. వీరిలో 495 మంది ప్రథమ శ్రేణిలో, 161 మంది ద్వితీయ శ్రేణి, తృతీయంలో 66 మంది పాసయ్యారు.

- సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 75.93 శాతం మంది పాసయ్యారు. ఈ విభాగంలో 20 వసతి గృహాల నుంచి 270 మంది విద్యార్థుల పరీక్షలకు హాజరుకాగా, వీరిలో 205 మంది పాసయ్యారు. మిగిలిన 65 మంది ఫెయిలయ్యారు. 75.93 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిని సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ ఆర్.గడ్డెమ్మ, సంక్షేమాధికారులు అభినందించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో 86.44 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ విభాగానికి సంబంధించి జిల్లాలో 546 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా, వీరిలో 472 మంది ఉత్తీర్ణులయ్యారు.

94 బడుల్లో వందశాతం ఉత్తీర్ణత

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో మొత్తం 558 పాఠశాలల నుంచి టెన్త్ పరీక్షలకు విద్యార్థులు హాజరుకాగా.. ఇందులో 94 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణతను సాధించాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలలు 34 ఉండగా, ప్రైవేటు పాఠశాలలు 94 ఉన్నాయి. అత్యధిక ఉత్తీర్ణతను సాధించిన మండలాలు చూస్తే సారవకోట 96.64 శాతంతో మొదటిస్థానంలో నిలవగా, 94.49 శాతంతో కోటబొమ్మాళి ద్వితీయ స్థానంలో, 91.45 శాతంతో బూర్జ తృతీయ స్థానంలో నిలవగా, ఇక 67.35 శాతంతో కొత్తూరు అట్టడుగున నిలిచింది.

ఎక్స్‌పో.. అదరహో

కాశీబుగ్గ: పలాస వేదిక శనివారం ప్రారంభమైన కాష్యూ టెక్ ఎక్స్‌పో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది. పలు రాష్ట్రాలకు చెందిన 28 కంపెనీలు ఈ ప్రదర్శనలో పాల్గొని అధునాతన యంత్రాలను చూపించాయి. వ్యాపారులు, ఔత్సాహికులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జీడిపిక్కలను బాయిలింగ్ చేసే యంత్రాలు, వాటికి సరిపడా ప్రెజర్‌ను అందించే ఫులింగ్ మిషన్‌లు, గాలి ఒత్తిడిని అందించే మిషన్‌లు, బాయిలింగు అయిన జీడి పిక్కలు కటింగ్ మిషన్‌లు, తొక్కను పిక్కను వేరు చేసే యంత్రాలు, పప్పుపై ఉన్న తొక్కను తీసే యంత్రాలు, పప్పును సైజును బట్టి వేరు చేసే యంత్రాలు, రంగును బట్టి పప్పును వేరు చేసే యంత్రాలు, పప్పును, బద్దలను, గుండను ఇలా సైజుల బట్టి వేరు చేసే యంత్రాలు, పప్పు పాడవకుండా ఆక్సిజన్ విడుదల చేసే ప్యాకెట్‌లు, పరిశ్రమలపై సన్‌లైట్ రూఫ్‌తో విద్యుత్ తయారుచేసి సద్వినియోగం చేసుకునే యంత్రాలు ఈ ప్రదర్శనలో ఉంచారు. మాన్యువల్, ఆటోమెటిక్, విద్యుత్, విద్యుత్‌యేతర పరికరాలను ప్రదర్శించారు.



జీడిపిక్కలను బెల్టుపై పంపి సైజులు వేరుచేసే యంత్రం



ప్రదర్శనలో వివిధ రకాల యంత్రాలు

గర్వకారణం..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జాతీయ స్థాయి కాష్యూ ఎక్స్‌పో రావడం మా అదృష్టం. ఇలాంటి ఎక్స్‌పోలు చూసి అనేక మంది పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ 60 ఎకరాల్లో నూతన పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయనున్నారు. – బల్ల గిరిబాబు, మున్సిపల్ చైర్మన్, పలాస-కాశీబుగ్గ

ప్రపంచంతో పోటీపడతాం



ప్రపంచంలో జీడిపప్పు వ్యాపారంలో పలాస జీడి పప్పుకు ప్రత్యేకమైన స్థానం ఉంది. పలాసలో ఉన్న 300 లకుపైగా పరిశ్రమదారులే కాకుండా మరికొందరు వ్యాపారులతో మార్కెట్‌ను పెంచుతాం. – మల్లా సురేష్‌కుమార్, అధ్యక్షులు, పీసీఎంఏ, పలాస

వియత్నాం నుంచి వచ్చాం..



భారతదేశంలో ఇప్పటి వరకు జరిగిన ఆరు ఎక్స్‌పోలకు సీఎంవీ కంపెనీ తరఫున వియత్నాం దేశం నుంచి విచ్చేశాం. కాష్యూ పరిశ్రమకు అవసరమైన యంత్రాలను తీసుకువచ్చి ఇక్కడ అవగాహన కల్పిస్తున్నాం. భారతదేశంలో ఉన్న అనేక బ్యాంకులతో అనుసంధానం అయి రుణాలను సైతం అందిస్తున్నాం. పలాస రావడం చాలా సంతోషంగా ఉంది. – ఈతెన్ ట్రోంగ్, సిఎంవి కంపెనీ, డైరెక్టర్, వియత్నాం దేశం.

కప్పరాడలో...

కూన కబ్జా జాడ

- కప్పరాడ కొండలో 'కూన రవి' భూ బాగోతంపై అనుమానాలు
- కొండ వద్ద భూమి కొనుగోలు చేసినట్టు అఫిడవిట్‌లో ప్రస్తావన
- అంకెలతో మాయ చేసిన కూన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :



ఈ చిత్రంలోని విచిత్రం చూదండి. ఇది విశాఖపట్నం సిటీలోని జాతీయ రహదారికి దగ్గరలో గల మురళీనగర్‌లోని కప్పరాడ కొండ. ఇక్కడ సర్వే నంబర్ 9/5లో 0.27సెంట్లు ప్రభుత్వ భూమిగా, 9/6లో 18.02 ఎకరాలు కొండపోరంబోకు భూమిగా ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇక్కడే టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ కూన రవికుమార్, తన సతీమణి, మరో వ్యక్తి కలిసి 18.57 సెంట్లు కొనుగోలు చేసినట్టు 2019 ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచారు. ఒక్కొక్కరి పేరున 2700 చదరపు అడుగుల చొప్పున 2008 మార్చి 3న కొనుగోలు చేసినట్టుగా అఫిడవిట్‌లో చూపించారు. కాకపోతే, సర్వే నంబర్ 9/5సీగా చూపించారు. వాస్తవానికి ఇక్కడ 9/5సీ అనేది ఎక్కడా లేదు. సర్వే నంబర్ 9/5, 9/6ఉంది. కానీ సబ్ డివిజన్ జరిగినట్టుగా 9/5సీలో కొనుగోలు చేసినట్టు చూపించారు. ఇప్పుడిది మిస్టరీగా మారింది.

తాను కొనుగోలు చేసిన భూమిగా చెప్పుకుని కప్పరాద కొండను తవ్వేసిన దృశ్యమిది. ఎకరన్నర వరకు అనధికారికంగా తవ్వేసి కబ్జా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడక్కడ చుట్టూ కంచె మాదిరి వేసిసి, వేరొక వ్యక్తికి ఇచ్చి భవన నిర్మాణ మెటీరియల్ స్టోరేజ్ సెంటర్ నడుపుతున్నట్టుగా తెలుస్తోంది.



గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన అఫిడవిట్‌తో కూన రవికుమార్ అడ్డంగా దొరికిపోయారు. కప్పరాయి కొండ వద్ద సర్వే నంబర్ 9/5, 9/6 ఉండగా, ఈయన మరో ఇద్దరితో కలిసి 2700 చదరపు అడుగులు చొప్పున కొనుగోలు చేసినట్టుగా చూపించారు. కానీ, ఆ 9/5సీ అనే నంబర్ అడంగల్‌లో గాని, వన్‌బీలో గాని కనిపించడం లేదు. లేని నంబర్‌తో కప్పరాడ కొండ వద్ద భూములు కొనుగోలు చేసినట్టు చూపించినట్టుగా స్పష్టమవుతోంది. దీని విలువ రూ.కోట్లలో ఉంటుంది. పక్కనున్న కొండపోరంబోకును కూడా తవ్వేసి కబ్జా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడా భూమి వందల కోట్లలో ఉంటుందని అంచనా.


సీఎంఓకు ఫిర్యాదు..

కప్పరాడ కొండ వద్ద లేని సర్వే నంబర్‌తో భూములు కొనుగోలు చేసినట్టు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారని, అక్కడ కొండను తవ్వేసి చదును చేశారని, ఇప్పుడక్కడ వేరే వ్యక్తి భవన నిర్మాణ మెటీరియల్ సరఫరా సెంటర్‌ను నడుపుతున్నారని ఆమదాలవలసకు చెందిన చింతాడ రవికుమార్ నేరుగా సీఎంఓకు ఫిర్యాదు చేశారు. తవ్విన కొండ ఫొటోలను, ప్రస్తుత పరిస్థితిని, గూగుల్ మ్యాప్, వన్‌బీ, అడంగల్ కాపీలను, ఎన్నికలప్పుడు ఇచ్చిన అఫిడవిట్ తదితర ఆధారాలతో కూడిన వివరాలన్నీ సీఎంఓకు పంపించారు. దాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన సీఎంఓ విచారణకు ఆదేశించింది. కప్పరాడ భూమి వ్యవహారంపై విచారణ జరపాల్సిందిగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శికి ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి లేఖ రాశారు. దాని మేరకు విచారణ జరపాల్సిందిగా ఈనెల 3వ తేదీన రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నుంచి విశాఖ జిల్లా కలెక్టర్‌కు కూడా ఆదేశాలు వచ్చాయి.

గతంలోనూ..

టీడీపీ అధికారంలో ఉండగా విప్ హోదాలో కూన రవికుమార్ చేసిన అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా ఉండేది. అధికార దర్పంతో సొంత జిల్లాలోనే కాకుండా పొరుగునున్న విశాఖ జిల్లాలో కూడా అక్రమాలకు పాల్పడ్డారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఉన్న వంశధార, నాగావళి నదుల్లో అక్రమంగా నిర్వహించిన ఇసుక ర్యాంపులతో కోట్లు సంపాదించారు. పోతయ్యవలస ర్యాంపు, సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం ర్యాంపు, ఆమదాలవలస మండలం దూసి రైల్వే వంతెన సమీపంలో నాగావళి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపారు. పురుషోత్తపురం ఇసుక ర్యాంపులోనైతే 25లారీలతో పాటు నాలుగు జేసీబీ లు వరద పోటుకు మునిగిపోయాయి కూడా. డ్రైవ ర్లు, క్లీనర్లు వరద దిగ్బంధంలో చిక్కుకున్న ఘటన అప్పట్లో సంచలనమైంది. ఇక అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలైతే చెప్పనక్కర్లేదు. అడిగే వాడే లేకుండా పోయారు. ఇప్పటికీ తనకున్న అధికార క్వారీ ముసుగులో అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఆయన అనుచరులు కూడా గ్రావెల్, మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన అనుచరుల క్వారీలోనే ఒక యువకుడు హత్యకు గురయ్యాడు. క్వారీలో లారీతో కుమ్మేసి, ఆ యువకుడ్ని అక్కడికి కిలోమీటరన్నర దూరంలోని ఒక రోడ్డుపై పడేసి, దాని పక్కన లారీ ఉంచేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. దీనికి సంబంధించి ఫొటోలతో సహా ఆధారాలు లభ్యమయ్యాయి. ఇక, తన సోదరుడు కూన సత్యనారాయణ విజయలక్ష్మీ కన్‌స్ట్రక్షన్ పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. నీరు-చెట్టు, రోడ్డు పనులను నాసిరకంగా చేపట్టి, కోట్లు మింగేశారు. వాటికి సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయి. వీరి నాసిరకం పనులను ప్రశ్నించారన్న కారణంతో గత ఏడాది ఓ ఇంజినీరింగ్ అధికారిపై నోటికొచ్చినట్టు మాట్లాడి, సదరు ఇంజినీరింగ్ కార్యాలయంలోనే దాడికి యత్నించారు. ఆ తర్వాత క్షమాపణ చెప్పేంతవరకు వ్యవహారం వెళ్లింది.

విచారణకు ఆదేశం



టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ భూకబ్జాలపై ముఖ్యమంత్రి కార్యాలయం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఆయనకు విచారణకు ఆదేశించిన కాపీలు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందాయి. రూ.100కోట్ల విలువైన భూమిని కూన రవికుమార్ ఆక్రమించారు. ఈ అక్రమ గుట్టు అధికారులు తేల్చాలి. కూన రవికుమార్ అక్రమ మైనింగ్ వ్యవహారాలపై కూడా త్వరలో విచారణ జరుగుతుంది. దానిపైన కూడా సీఎంఓకు ఫిర్యాదు చేశాను. త్వరలోనే కూన రవికుమార్ జైలు కెళ్లడం ఖాయం. – చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ప్రచార జోనల్ ఇన్‌చార్జి

'మోచ' తుపాను హెచ్చరిక

- తీర మండలాలు అప్రమత్తం కావాలి
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, తుపాను ప్రత్యేక అధికారి సిద్ధార్థ్‌జైన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మోచ తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సర్వే, భూరికార్డుల కమిషనర్, తుపాను ప్రత్యేక అధికారి సిద్ధార్థ్ జైన్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మోచ తుపానుపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి సమీక్షించారు. మొక్కజొన్న కొనుగోళ్లపై ఆరా తీశారు. జిల్లా మేనేజర్ మార్క్‌ఫెడ్ వారి పర్యవేక్షణలో మండలాల వారీగా సేకరించే మొక్కజొన్న వివరాలను, మ్యాపింగ్ వివరాలు అందించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షిస్తూ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు సబ్‌స్టేషన్లలో అందుబాటులో ఉంచాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలైన 11 మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తుపాను సమయంలో అధికారులు, సిబ్బంది ఎలాంటి సెలవులు వినియోగించుకోరాదని తెలిపారు. తుపాను సహాయక చర్యల కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08942 240557 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో అడిషినల్ ఎస్పీ, ఇతర వివిధ శాఖల అధికారులు ఉన్నారు. పశు సంవర్ధక శాఖపై సమీక్షించారు. పోలీసు శాఖ చేపట్టబోయే చర్యల గురించి అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర్ వివరించారు.

క్లుప్తంగా

సెలవుల్లో క్లాసులకు రమ్మంటున్నారు!

- డయల్ యువర్ వర్సిటీలో విద్యార్థుల ఫిర్యాదు



ఫోన్ ఇన్ లైవ్ నిర్వహిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్‌ఇన్ లైవ్ కార్యక్రమం నిర్వహి ంచారు. 15 ఫోన్ కాల్స్ రాగా దాదాపుగా పరీక్షలు ఫలితాలు, నిర్వహణపైనే విద్యార్థులు ప్రశ్నలు వేశారు. పొందూరు, శ్రీకాకుళం, పలాస ప్రాంతాల నుంచి ఇయర్ ఎండ్ విధానంలో డిగ్రీ చదివిన విద్యార్థులు స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని, డిగ్రీ ఉత్తీర్ణత బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల వల్ల సాధ్యం కాలేదని చెప్పారు. అధికారులు స్పందిస్తూ ప్రస్తుతం సెమిస్టర్ విధానంలో పరీక్షలు జరుగుతున్నాయని, ఇయర్ ఎండ్ విద్యార్థుల కోసం మూడేళ్లకు ఒకసారి స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం కాకినాడ అదిత్య నుంచి కొందరు విద్యార్థులు ఫోన్ చేస్తూ వర్సిటీ అనుబంధ కళాశాలలకు ఈ నెల 8 నుంచి 31 వరకు సెలవులు ప్రకటించారని, తమ కళాశాలలో తరగతులకు రమ్మంటున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతామని అధికారులు చెప్పారు. రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాల కోసం విద్యార్థి ప్రశ్నించగా పది రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు. ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ కోసం ప్రశ్నించగా, జూన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ రెండో సెమిస్టర్ 10 రోజుల్లో, మొదటి సెమిస్టర్ ఫలితాలు ఈ నెల చివర్లో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, పీలా సుజాత, డాక్టర్ ఎం.అనూరాధ పాల్గొన్నారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని లైబ్రరీల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.వి.జి.ఎస్.శంకరరావు అధ్యక్షతన శాఖా గ్రంథాలయాధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు నిర్వహించి పిల్లల్లో సృజనాత్మకత వెలికితీయాలన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సువ్వారి సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూర్మనాథాలయంలో పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మనాథుని కల్యాణ ముగింపు ప్రక్రియలో భాగంగా శనివారం సాయంత్రం అనివెట్టి మంటపంలో స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పుష్పయాగం నిర్వహించారు. పలు రకాల ఆహార పదార్థాలను నివేదించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జూన్ 15 నాటికి ఉద్దానం ప్రాజెక్టు సిద్ధం

- పనుల్లో జాప్యం జరిగితే ఇంజినీర్లదే బాధ్యత
- అధికారుల సమీక్షలో మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో దాదాపు రూ.700కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే నెల 15 నాటికి సిద్ధం కావాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇంజినీర్లను ఆదేశించారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగితే పూర్తి బాధ్యత ఇంజనీర్లదేనని, తప్పించుకునే ధోరణి ఉండరాదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే ముఖ్యమంత్రి ప్రారంభించేందుకు జిల్లాకు వస్తారని వివరించారు. ఈ విషయాన్ని భావనపాడు, భోగాపురం పర్యటనల్లో సీఎం స్వయంగా ప్రకటించినట్లు మంత్రి గుర్తుచేశారు.

శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్దానం ప్రాజెక్ట్ పనుల పురోగతిపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రాధాన్యతను ఇంజినీరింగ్ అధికారులు గుర్తెరిగి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్దానంలో ఒక ప్రాంతం కాకుండా ఉద్దానం అంతటా నీరు అందాల్సిందేనని స్పష్టం చేశారు. పైపులైన్లు, పంపు సెట్లు, విద్యుత్ భూసమస్యలు, ఇతర సమస్యలను గుర్తించి సంబందిత అధికారులతో సమన్వయం చేసుకొని పనులు వేగవంతం చేయాలన్నారు. జూన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

5 నాటికి పూర్తయిన పనుల ప్రగతి నివేదికలు తనకు వివరించాలని సూచించారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ఉప కార్యనిర్వాహక, కార్యనిర్వాహక ఇంజినీర్లకు అప్పగించిన పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల వివరాలను తమకు సమర్పించాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తుల భూముల్లో పైపులైన్లు వేయాల్సి వస్తే న్యాయపరమైన చెల్లింపులు చేస్తామని, పనులకు ఆటంకం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ టి.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును చూసి ప్రజలు నవ్వుతున్నారు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న వెంటనే రైతాంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కలెక్టరేట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఇటీవల రైతాంగ సమస్యలపై చేసిన వ్యాఖ్యలకు మంత్రి స్పందించారు. గత ప్రభుత్వంలో రైతులు దగా పడ్డారని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లేక రైతాంగం ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. వర్షం వల్ల తడిచిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసే ప్రక్రియ ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా సివిల్ సప్లయ్ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడి కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పౌర సరఫరాల మంత్రి కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నిత్యం వార్తల్లో ఉండాలనే కోరిక తప్ప చేసిందేమీ లేదన్నారు. నాడు వ్యవసాయం దండగని అవమానించిన తీరును మంత్రి గుర్తు చేశారు. అలాంటి చంద్రబాబు రైతుల కోసం మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. నేటి ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని దశలో రైతుకు అండగా నిలుస్తోందన్నారు.

హైకోర్టు జడ్జి దృష్టికి జిల్లా కోర్టు సమస్యలు



జస్టిస్ భానుమతిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.భానుమతిని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా, డీఎల్ఎస్ కార్యదర్శి సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ జిల్లా కోర్టు ఆవరణలో బ్యాంకును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. వీటితో కోర్టులో పలు సమస్యలను కూడా ఆమెకు వివరించారు. అనంతరం న్యాయమూర్తి భానుమతి మాట్లాడుతూ కోర్టులో జూనియర్ న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. స్టేట్ బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి నీలంశెట్టి చిన్నారావు, ట్రెజరర్ ఎల్.నారాయణ, గ్రంథాలయ కార్యదర్శి ఎం.భవానీ ప్రసాద్, స్పోర్ట్సు కార్యదర్శి జి.భాస్కరరావు, మహిళా ప్రతినిధి వి.హరిప్రియ, సీనియర్ న్యాయవాదులు పాడి సీతంనాయుడు, వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి, టి.ఖగేంద్ర, ఎస్.వెంకటరావు, శిష్టు రమేష్, బి.ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ భానుమతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.భానుమతిని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం ఆర్అండ్‌బీ వసతి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయాధికారులకు జరిగే పీరియాడికల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆమెకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం క్రైమ్: ఆటల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తిని చాటుకోవడమే ప్రధానమనే విషయాన్ని క్రీడాకారులు మరిచిపోవద్దని ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ముందుగా జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్లు సయ్యద్ ఇషాక్ మహ్మద్, వీఎస్ పంతులు, సి.వి.రాజారెడ్డి, మీర్ మహ్మద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించే దిశగా జిల్లా కేంద్రంతోపాటు సబ్‌సెంటర్లలో సైతం కోచింగ్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉన్నతంగా రాణించి ఐపీఎల్‌తో పాటు ఇండియా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ మాట్లాడుతూ వర్షాల కారణంగా ఐదు రోజులు జాప్యం జరిగిందని, సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపులు 25 రోజుల పాటు జరుగుతాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయి ఎంపికలకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అనంతరం



క్రికెట్ కిట్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

సీఐ ఇలియాస్ మహ్మద్ స్పాన్సర్‌షిప్‌తో దాదాపు రూ.50వేలు విలువైన క్రికెట్ కిట్లను ఎస్పీ చేతులమీదుగా సబ్‌సెంటర్ల క్రీడాకారులు, కోచ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్సీ రెడ్డి, కె.ఎస్ మదీనాశైలానీ, బెనర్జీ, దివాకర్, జోన్ చీఫ్ సెలక్టర్ ఎంఎస్ దీపక్‌కుమార్, సీనియర్ క్రికెటర్ భద్రగిరి మురళీ, స్థానిక కళాశాల పీడీ డాక్టర్ ఎ.మోహన్‌రాజు, కొయ్యాన మధు, కోచ్‌లు కె.సుదర్శన్ (శ్రీకాకుళం), అన్నెపు ఆనంద్, ఎం.రాజాబాబు (కళింగపట్నం), కె.శ్రీనివాస్ (టెక్కలి), అనీల్ (నరసన్నపేట), గోపి (ఇచ్ఛాపురం), మహిళా కోచ్‌లు రమణమ్మ, దమయంతి, ఫిట్‌నెస్ కోచ్ పి.రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచే డిగ్రీ రీసెర్చ్, హానర్స్ కోర్సులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది నుంచి డిగ్రీ రీసెర్చ్, హానర్స్ డిగ్రీ కోర్సులు ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. విశ్వవిద్యాలయంలో శనివారం డీన్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్యతో కలిసి కోర్సుల నిర్వహణ మార్గదర్శకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020-21లో డిగ్రీ ప్రవేశాలు పొందిన విద్యార్థులు చివరి ఏడాదికి చేరుకున్నారని తెలిపారు. జూన్‌లో ఆరో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించి, జూలైలో ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు హానర్స్, రీసెర్చ్ డిగ్రీ మరో ఏడాది చదివేందుకు అర్హులని పేర్కొన్నారు. హానర్స్‌కు ఉత్తీర్ణత సరిపోతుందని, రీసెర్చ్ కోర్సుకు డిగ్రీ మూడేళ్ల కోర్సు ఆరు సెమిస్టర్లలో గ్రూపు సబ్జెక్టుల్లో 75 శాతం మార్కులు ఉండాలని స్పష్టం చేశారు. అన్ని డిగ్రీ కళాశాలలకు ఈ కోర్సులు నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. మూడేళ్లలో కనీసం 30 శాతం దాటి డిగ్రీ ప్రవేశాలు జరగాలని చెప్పారు. నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఒక ఏడాది పీజీ చదివితే సరిపోతుందన్నారు. డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు నాలుగో ఏడాది కోసం వర్సిటీకి దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన కళాశాలల్లో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో సైతం నాలుగో ఏడాది డిగ్రీ రీసెర్చ్, హానర్స్ నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సులో ఏడు, ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయని తెలిపారు. 7వ సెమిస్టర్‌లో గ్రూపు సబ్జెక్టులు ఉంటాయని, 8వ సెమిస్టర్‌లో విద్యార్థి ఎంచుకున్న ఒకే ప్రత్యేక సబ్జెక్టు ఉంటుందని వివరించారు. నూతన విద్యా విధానం నేపథ్యంలో ఈ ఏడాది డిగ్రీ పూర్తిచేస్తున్న విద్యార్థులతో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలతో పాటు మరికొన్ని కళాశాలల్లో మొదటి బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో 92 కళాశాలలు కోర్సు నిర్వహణకు ఆసక్తి చూపిస్తున్నాయని, అర్హత బట్టి ఎంపికచేస్తామన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ బిడ్డిక అడ్డయ్య

అరసవల్లి దర్శనాలకు
వైశాఖ ప్రత్యేక మార్గాలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వైశాఖ మాసం మూడో ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశమున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. గత ఆదివారం జరిగిన పలు లోపాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా వివిధ దర్శనాల మార్గాల వద్ద విధులు నిర్వర్తించేలా, ఎప్పటికప్పుడు పరిస్థితుల పర్యవేక్షించేలా ఆదేశించినట్లు వివరించారు.



సంప్రదాయ పూజలకు సిద్ధం చేసిన పుష్కరిణి మెట్లు ప్రాంతం

కుమారుడిని రక్షించేందుకు వెళ్లి..

- విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



సుందరమ్మ(ఫైల్)

బూర్జ: మండలంలోని అన్నంపేటకు చెందిన అంపోలు సుందరమ్మ (42) శనివారం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందరమ్మ కుమారుడు సతీష్ ఎలక్ట్రికల్ బోర్డు ప్లగ్‌లో ఫ్యాన్ వైరు పెడుతుండగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. తల్లి సుందరమ్మ గమనించి కుమారుడు ప్రాణం రక్షించేందుకు అబ్బాయిని పక్కకి తోసి ఫ్యాన్ వైరు పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సతీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో అన్నంపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతురాలికి భర్త రాజులు, కుమారుడు సతీష్ ఉన్నాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

'సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం వద్దు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు పొందే సేఫ్టీ, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్, శానిటరీ సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం వద్దని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం అఫ్లియేషన్, అకడమిక్ ఇన్‌స్పెక్షన్ తదితర అంశాలపై ప్రైవేట్ జూనియర్ కలశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 కళాశాలలు ఉండగా అఫిలియేషన్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 26 జూనియర్ కళాశాలల్లో ఈ నెల 15 నాటికి తనిఖీలు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన కళాశాలల యాజమాన్యాలు వెంటనే ప్రభుత్వం నిర్దేశించిన రుసుమును చెల్లించాలని సూచించారు. అఫిలియేషన్ లేకుంటే అడ్మిషన్లు ఉండవన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు.

ప్రాంతీయ తనిఖీ అధికారి ఎస్.తవిటినాయుడు మాట్లాడుతూ గతంలో 121 జూనియర్ కళాశాలలు ఉండేవని, ప్రస్తుతం 100 కళాశాలలు మాత్రమే ఉన్నాయని, అందులో 76 కళాశాలలు ఉత్సాహంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ప్రైవేటు కళాశాల యాజమాన్యాల ప్రతినిధులు కలెక్టర్‌ను సత్కరించారు.

రైస్‌మిల్లులో చోరీ



రైస్ మిల్లు పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు జంక్షన్ వద్ద శ్రీనివాస రైస్‌మిల్లులో శుక్రవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ఇద్దరు వ్యక్తులు కార్యాలయ గది తాళాలు పగలగొట్టి లాకర్లు తీసి రూ.80 వేలు నగదు తీసుకెళ్లారు. నైట్ వాచ్‌మేన్, మిల్లు డ్రైవర్ కుటుంబం కూడా అదే ఆవరణలో ఉన్నా, వారికి తెలియకుండానే దొంగలు జాగ్రత్త పడ్డారు. పక్కనే ఉన్న శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని శ్రీసీతారామ మిల్లులోకి వెళ్లి కార్యాలయ తలుపులు బద్దలు కొట్టినా అక్కడ ఏమీ లభ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. అక్కడికి కొంతదూరంలో పెట్రోల్‌బంక్ వెనుక ఉన్న చల్ల వారి మిల్లు వద్దకు వెళ్లేసరికి నైట్‌వాచ్‌మేన్ పెద్దగా కేకలు వెయ్యడంతో దొంగలు పారిపోయినట్లు తెలుస్తోంది. క్లూస్‌టీం, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ మధుసూదనరావులు మిల్లులను పరిశీలించారు. పెట్రోల్‌బంక్, వప్పంగి, శిమ్మపేట జంక్షన్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. మిల్లు యజమాని రెడ్డి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,640-00
బంగారం(22సి. 10గ్రా.)	56,500-00
వెండి (కిలో)	82,400-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 465.00
విజయనగరం	రూ. 469.00
శ్రీకాకుళం	రూ. 469.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250